సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేల సంరక్షణతోనే ఆరోగ్యం



జెండాను ప్రదర్శిస్తూ రన్నింగ్ చేస్తున్న శర్మ

ఎంవీపీ కాలనీ: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చల్లా లాం సుబ్రహ్మణ్యం శర్మ అనే చార్టెడ్ సివిల్ ఇంజినీర్ సేవ్ సోయిల్ పేరిట ఆదివారం వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక జెండాను ప్రదర్శిస్తూ నగరంలోని ఎంవీపీ కాలనీతో పాటు బీచ్ రోడ్డులోని పలు ప్రాంతాల్లో రన్నింగ్ చేశారు. ప్రతి వ్యక్తి పౌష్టికారంతో ఆరోగ్యంగా జీవించాలంటే నేల సురక్షితంగా ఉంచాలనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు శర్మ వెల్లడించారు. విశాఖలో 30 కిలోమీటర్ల మేర రన్నింగ్ క్యాంపెయిన్ నిర్వహించినట్లు తెలిపారు. నేలను సురక్షితంగా ఉంచడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఎన్‌ఆర్‌ఐపీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం సభ్యులు

బీచ్ రోడ్డు: నాన్ రెసిడెంట్ ఇండియన్ పేరెంట్స్ అసోసియేషన్(ఎన్‌ఆర్‌ఐపీ) నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా ఎల్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా పి.వి.సీతారామరాజు, కోశాధికారిగా సిహెచ్.శ్రీరామమూర్తి, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

యువకుడి అదృశ్యం



హరీష్(ఫైల్)

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైనట్టు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. జీవీఎంసీ 12వ వార్డు క్రాంతినగర్‌కు చెందిన కల్యంపూడి హరీష్(34)కు రెండేళ్ల క్రితం వివాహమైంది. అతనికి భార్య, పాప ఉన్నారు. ఈ నెల 6న ఉదయం ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి ఇంతవరకు ఇంటికి చేరలేదు. శనివారం అంతా బంధువులు, స్నేహితులను సంప్రదించినా ఎక్కడా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అదేరోజు సాయంత్రం హరీష్ తండ్రి ప్రసాదరావు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. హరీష్ సెల్ ఫోన్ కూడా ఇంటి వద్ద విడిచిపెట్టి బయటకు వెళ్లిపోయినట్లు ఫిర్యాదులో తండ్రి పేర్కొన్నారు. ఆయన ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరుతున్నారు.

ఉగాది పర్వదినాన బంగారు చీరలో లలితాదేవి



బంగారు చీర అలంకరణలో లలితాదేవి(ఫైల్)

సీతంపేట: ఉగాది పర్వదినం సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో కొలువైన లలితాదేవి అమ్మవారు బంగారం చీర అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం 75వ వార్షికోత్సవంలో భాగంగా భక్తులు, దాతల విరాళాలతో అమ్మవారికి రెండు కిలోల బంగారంతో చీర చేయించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 22న అమ్మవారికి పీఠాధిపతి చేతుల మీదుగా బంగారు చీర అలంకరించారు. మళ్లీ మొదటి సారి బంగారు చీర అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఈ నెల 9న మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8 గంటల వరకు లలితాదేవి బంగారు చీరలో దర్శనం ఇస్తారని, భక్తులు దర్శించి తరించాలని కృష్ణసేన్ కోరారు.

అద్దంలా రహదారి

- కొలిక్కి వచ్చిన మానసిక ఆస్పత్రి రోడ్డు విస్తరణ
- పోలమాంబ ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ పార్కు వరకు ఆధునికీకరణ



వైవిధ్యమైన రంగులతో ఫుట్‌పాత్



కొత్తగా అభివృద్ధి చేసిన రహదారి

ఏయూ క్యాంపస్: రహదారుల అభివృద్ధికి ఈ మార్గం ఓ మచ్చుతునక. అధ్వానంగా.. అంధకారంతో నిత్యం దర్శనమిచ్చే మానసిక ఆస్పత్రి రోడ్డు విస్తరణ పనులు ఓ కొలిక్కి వచ్చాయి. పోలమాంబ ఆలయం నుంచి వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కు వరకు రహదారి ఆధునికీకరణ పనులు తుది దశకు చేరాయి. ప్రస్తుతంలో ఈ మార్గంలో ప్రయాణిస్తున్న నగరవాసులకు ఓ కొత్త అనుభూతి కలుగుతోంది. విశాలమైన రహదారి, ఇరువైపులా కంచె వంటి భద్రత వలయం, ఫుట్‌పాత్‌లు, డివైడర్‌పై మొక్కల పెంపకం, అందమైన విద్యుత్ దీపాల వెలుగులు ఆకర్షణీయంగా నిలుస్తున్నాయి.

గతంలో ఈ రహదారి 60 అడుగులతో ఉండేది. దీనిని ప్రస్తుతం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 100 అడుగులకు విస్తరించారు. రహదారికి రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి, మధ్యలో మొక్కలు నాటారు. వాటికి అవసరమైన నీరు అందించడానికి ప్రత్యేకమైన వ్యవస్థను, టీ గార్డులను సైతం ఏర్పాటు చేశారు. రహదారికి ఒక వైపున ఆస్పత్రుల ప్రహరీలు ఉండగా.. మరో వైపు ఇనుముతో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. రహదారి మధ్యలో డివైడర్లపై సైతం పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టారు. ఈ రహదారి మధ్యలో కాంతివంతమైన విద్యుద్దీపాలు అమర్చారు. పాదచారుల కోసం ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లపై కాంతి ప్రసరించేలా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయడం విశేషం. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల మధ్య ఈ రహదారి సరికొత్తగా దర్శనమిస్తోంది.



మొక్కలకు రక్షణగా టీ గార్డులు

తీరంలో ఎంపీ ఎంవీవీ ప్రచారం



వాకర్స్‌తో టీ తాగుతూ ముచ్చటిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న లావణ్య, సత్యవతి తదితరులు

బీచ్ రోడ్డు: సాగరతీరంలో వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వాకర్స్‌తో ముచ్చటిస్తూ గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల కోసం వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి అత్యధిక మెజార్టీతో తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముప్పల సురేష్, మదుపాడ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో ఇంటింటి ప్రచారం

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపులో ప్రతి ఒక్కరూ కీలకపాత్ర పోషించాలని 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య పిలుపునిచ్చారు. పార్టీ స్థానిక మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లో ఆదివారం పలువురు మహిళలతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించడంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్న తీరుపై అవగాహన కల్పించారు. మహిళల సంక్షేమానికి, కుటుంబ అవసరాలకు అనుగుణంగా అమ్మ ఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను ప్రభుత్వం అందిస్తోందని మహిళ ఓటర్లకు వివరించారు. ఈ ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుకతోటలో..

మద్దిలపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీ, విశాఖ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తరపున ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు 16వ వార్డు ఇసుకతోటలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కర పత్రాలు అందజేశారు. ఈ ప్రచారంలో వార్డు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతోటలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు

ఉత్సాహంగా వాక్‌థాన్



వాక్‌థాన్‌లో పాల్గొన్న సిబ్బంది

బీచ్ రోడ్డు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆదివారం లీ హెల్త్ డొమైన్, లీ ఫార్మా లిమిటెడ్ సంస్థలు బీచ్ రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించాయి. ఈ వాక్‌థాన్ ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం ప్రాజెక్ట్ స్మూత్వాల్క్ పేరుతో ఆర్థో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు ప్రవీణ్ రెడ్డి, ఆళ్ల లీల రాణి తెలిపారు.

అభాగ్యుడికి ఆశ్రయం



భాస్కరరావుకు ఐడీ కార్డు అందజేస్తున్న ప్రగడ వాసు

అల్లిపురం : కరోనాలో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలను పోగొట్టుకున్న కుర్మన్నపాలేనికి చెందిన భాస్కరరావు అనాథలా మిగిలిలాడు. ఆస్పత్రి బిల్లు కోసం తనకున్న 107 గజాలు ఇంటి స్థలాన్ని ఆస్పత్రి వారికి రాసిచ్చాడు. తుదకు నిలువ నీడ లేకుండా రోడ్డున పడ్డాడు. దీంతో అతనిని జీవీఎంసీ ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు చేరదీసి ఆశ్రయం కల్పించారు. అతనికి ఓటరు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించి షెల్టర్‌లో డ్రైవర్‌గా పనికి చేర్చుకుని ఉపాధి కల్పించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చేలా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసి సమన్వయంతో పని చేయాలని 28వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కోరారు. ఆదివారం జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల కోసం ప్రజలకు వివరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ గెలుపు లక్ష్యంగా కష్టపడాలని పిలుపునిచ్చారు.

ఘనంగా నూకాలమ్మ తొలేళ్ల పండగ



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురం కాలనీలో కొలువుదీరిన శ్రీనూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం తొలేళ్ల సంబరంతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్లు, గాజులు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు డి.వెంకటాచార్యులు భక్తుల గోత్ర నామాలతో అర్చన చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

సీతారాముల పరిణయానికి ఏర్పాట్లు



రెండో భద్రాద్రిగా పేరొందిన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం

దాబాగార్డెన్స్ : లోకాభిరాముడు శ్రీరాముడు జనకసుత జానకిని పరిణయమాడే సుముహూర్తం సమీపించడంతో జగదాంబ జంక్షన్ సమీపాన మహారాణిపేట అంబికాబాగ్ రామాలయంలో కల్యాణం ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 9 నుంచి 18 వరకు నిర్వహించనున్న సీతారాముల కల్యాణ మహోత్సవాలకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు మిరుమిట్లు గొలిపే దీపాలంకరణ చేపట్టారు.

కార్యక్రమాలివీ..

ఈ నెల 9 నుంచి 18 వరకు స్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు.

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం కల్యాణరాట, పెండ్లి కుమారుని చేయుట, పంచాంగ శ్రవణం జరపనున్నారు. 10 నుంచి 18 వరకు ప్రతి రోజూ ఉదయం స్వామికి విశేష ఆరాధన, సహస్రనామార్చన, సాయంత్రం వేళల్లో విశేష ఆరాధన, హారతులు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 ఉదయం 5 గంటలకు స్వామి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు జరపనున్నారు. ఉదయం 10 గంటల నుంచి 12 వరకు స్వామి కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టనున్నారు. 18న శ్రీరామ పట్టాభిషేకం జరపనున్నారు. కల్యాణం చేయించుకోదలిచే భక్తులు 0891–2528645, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 15, 16, 18వ వార్డులకు చెందిన 200 మందికిపైగా యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం సాయంత్రం లాసన్స్‌బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో వారికి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంపల వెంకట రామచంద్రరావు ఆధ్వర్యంలో వీరంతా వైఎస్సార్‌సీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా రంజక పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి పార్టీకి అఖండ విజయాన్ని ప్రజలు అందించాలన్నారు. తద్వారా ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి రాష్ట్రంలో పెద్ద ఎత్తున కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గోపాలపురం పరిశీలకుడు గన్నమనేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పక్షుల దాహార్తిని తీరుద్దాం

సీఎంఆర్ సెంటర్‌లో వాటర్ బౌల్స్ పంపిణీ



బౌల్స్ అందిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మద్దిలపాలెం: పక్షులను ప్రతి ఒక్కరూ ప్రేమించాలని, వాటికి ఈ వేసవిలో దాహార్తిని తీర్చేందుకు కృషి చేయాలని సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, గ్రీన్ స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ గీతానారాయణ్ సుదగాని పిలుపునిచ్చారు. గ్రీన్ సంస్థ, కేన్ ఫౌండేషన్ సంయుక్తంగా మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో ఆదివారం ఉచితంగా సిమెంట్ వాటర్ బౌల్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మావూరి మాట్లాడుతూ జంతు సంరక్షణ కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. గ్రీన్ సంస్థ వ్యవస్థాపకురాలు గీతా నారాయణ సుదగాని మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకి పెరుగుతున్న నేపథ్యంలో పక్షులకు నీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత 12 ఏళ్లుగా నగరంలో ఉచితంగా సిమెంట్ వాటర్ బౌల్స్‌ను పంపిణీ చేస్తున్నామన్నారు. పక్షులు తిరిగే ప్రాంతాలలో ఈ గిన్నెలను పెట్టి రోజూ రెండు పూటలా నీటితో నింపాలని ఆమె సూచించారు. క్రమం తప్పకుండా రోజూ వాటిని శుభ్రం చేయాలన్నారు. ఇంటి పరిసరాలలో పక్షులకు అనుకూలమైన వాతావారణాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. కెన్ ఫౌండేషన్ ప్రతినిధి సంతోష్ మాట్లాడుతూ మరిన్ని ప్రాంతాలలో వాటర్ బౌల్స్ పంపిణీ చేయనున్నామన్నారు.

ఆరోగ్యకర వాతావరణంలో జీవించాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నా ఆరోగ్యం–నా హక్కు' అన్న నినాదంతో 1948 నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు మంచినీరు తాగడం, ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించడం, ఆరోగ్యకరమైన ఆహారం భుజించడం చేయాలన్నారు. ఈ ర్యాలీలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన రాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్లు సయ్యద్ బేగం, కోటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

- అప్పన్న స్వామికి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టంపజేసి కల్యాణం జరిపారు.
- ఆలయ కల్యాణ మండపంలో అప్పన్న స్వామి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేసి అష్టోత్తర శతనామవళి పూజ నిర్వహించారు.

ఎంపీ నిధులతో ఆరిలోవ అభివృద్ధికి కృషి



ఫ్యాన్ గుర్తును చూపిస్తూ మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



సభకు హాజరైన 12వ వార్డు ప్రజలు

- మీసాలు తిప్పడం.. మోసాలు చేయడం వెలగపూడి నైజం
- రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు
- ఎంపీ ఎంవీవీ ఆధ్వర్యంలో 'మేము సిద్ధం–మా బూత్ సిద్ధం' సభ



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బాబూరావు

ఆరిలోవ: ఎంపీ నిధులను ఆరిలోవ అభివృద్ధి కోసం వెచ్చిస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు హామీ ఇచ్చారు. జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలో ఆదివారం 'మేము సిద్ధం –మా బూత్ సిద్ధం'సభ విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా బాబూరావు మాట్లాడుతూ తాను విశాఖ జిల్లా అభివృద్ధి అధికారిగా పని చేసినప్పుడు ఆరిలోవ ప్రాంతాన్ని అభివృద్ధి చేసినట్లు గుర్తు చేశారు. రాజ్యసభ నిధులతో ఆరిలోవలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. తూర్పు నియోజకవర్గంలో ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి దోహదపడతాయన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మీసాలు తిప్పడం.. మోసాలు చేయడం తప్పా, ప్రజలకు మేలు చేయలేదని ఆరోపించారు.

అనంతరం ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో పేద, మధ్య తరగతి మహిళలకు చేయూతను ఇచ్చి లక్షాధికారులను చేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ప్రజలను కోరారు. గత మూడు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఉన్న వెలగపూడి రామకృష్ణబాబు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. జన్మభూమి కమిటీల ద్వారా టీడీపీ వారికి మేలు చేకూర్చుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన అందరికీ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల శిబిరానికి విశేష స్పందన



దివ్యాంగులకు కొలతలు తీస్తున్న నారాయణ సేవా సంస్థాన్ సిబ్బంది

సీతంపేట: రాజస్థాన్ ఉదయ్‌పూర్‌కు చెందిన నారాయణ సేవా సంస్థాన్ అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కృత్రిమ అవయవాల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించింది. రాష్ట్రం నలుమూల నుంచి సుమారు 500 మంది దివ్యాంగులు కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీయించుకున్నారు. వారికి రెండు, మూడు నెలల్లో కృత్రిమ అవయవాలు అందజేస్తామని సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మార్వాడి సంస్థలు, లయన్స్ క్లబ్, ఆంధ్రా ఆర్టిస్ట్ ఫెడరేషన్, సోషల్ మీడియా క్లబ్, డాక్టర్ చిరంజీవి కళాపరిషత్, స్థానిక నారాయణ సేవా సంఘం ప్రతినిధులు వైద్య శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు ఆహారం అందించారు. నారాయణ సేవా సంస్థాన్ డైరెక్టర్ రంజిత్ గౌడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.